క్లుప్తంగా

ఉచిత కంటి వైద్య శిబిరం


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కరప: అంజు కంటి ఆసుపత్రి సౌజన్యంతో స్థానిక చిరంజీవి కల్యాణ మండపంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. యాళ్ల వీరవెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ వైద్య శిబిరానికి కరప, పరిసర గ్రామాలకు చెందిన 225 మంది హాజరయ్యారు. వైద్య నిపుణులు డాక్టర్ తేజ సిబ్బందితో కలిసి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 15 మందికి ఆపరేషన్లు అవసరమని నిర్ధారించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

జాబ్‌మేళా బులెటిన్ ఆవిష్కరణ

కాకినాడ సిటీ: నగరంలోని పీఆర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో వికాస, ఏపీఎస్ఎస్‌డీసీ సహకారంతో ఈ నెల 22న కళాశాలలో నిర్వహించే మెగా జాబ్‌మేళా బులెటిన్‌ను కలెక్టర్ షణ్మోహన్ సగిలి బుధవారం కలెక్టర్ చాంబర్‌లో ఆవిష్కరించారు. ఫార్మా, బ్యాంకింగ్, బీపీవో టెక్నికల్ రంగాలకు చెందిన 30 ప్రముఖ కంపెనీల్లో 1,500 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వికాస పీడీ కె.లచ్చారావు, ఏపీఎస్ఎస్‌డీసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో నిందితులకు జైలు, జరిమానా విధిస్తూ కాకినాడ మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్-1, 2 పోలీసు స్టేషన్లలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. నిందితులను బుధవారం కోర్టులో హాజరుపరిచారు. వీరిలో 20 మందికి మూడు రోజుల చొప్పున జైలు, 12 మందికి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు గుండెపోటు

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి గుండెపోటుకు గురయ్యారు. బుధవారం తెల్లవారుజామున 2.30 సమయంలో గుండెపోటు రాగా, బంధువులు ఆమెను స్థానిక ట్రస్ట్ ఆస్పత్రిలో చేర్చారు. ఆస్పత్రిలో చేర్చడం ఆలస్యమై ఉంటే ప్రాణాపాయం వాటిల్లేదని వైద్యులు తెలిపారు. అత్యవసర స్థితి నేపథ్యంలో స్టంట్ వేశామని, ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ట్రస్ట్ ఆస్పత్రిలో డాక్టర్ లావణ్యకుమారిని పరామర్శించి, ఆరోగ్య స్థితిపై ఆరా తీశారు. రంగరాయ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్, ఇతర వైద్య ప్రముఖులు ఆమెను పరామర్శించారు.

నూకాలమ్మకు రూ.11.81 లక్షల ఆదాయం


నూకాలమ్మ ఆలయంలో హుండీలను లెక్కిస్తున్న భక్తులు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన మండలంలోని కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారికి హుండీల ద్వారా రూ.11,81,458 ఆదాయం లభించిందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.సౌజన్య తెలిపారు. జాతర మహోత్సవాల్లో భాగంగా, జాతర మధ్యలో 34 రోజులకు గాను బుధవారం హుండీలను లెక్కించినట్టు చెప్పారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు సోమరాజు, వేణుగోపాల్, డి.శ్రీనివాసరావు సమక్షంలో హుండీలను లెక్కించగా, అమ్మవారికి రూ.11,81,458 ఆ దాయం సమకూరిందని ఈఓ సౌజన్య తెలిపారు.

అరాచకం సృష్టిస్తున్న వారిపై చర్యలు చేపట్టాలి

కాకినాడ సిటీ: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం జి.వేమవరం గ్రామంలో భయాన్ని, అరాచకాన్ని సృష్టిస్తున్న వ్యక్తులపై చర్యలు చేపట్టాలని కోరుతూ జి.వేమవరం గ్రామానికి చెందిన సూరంపూడి నూకరత్నం, అర్జునరావు దంపతులు బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్‌కు విన్నవించుకున్నారు. స్థలం విషయమై వారు తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వారిపై కోరింగి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారం రోజుల క్రితం రాత్రి సమయంలో వారు కత్తులు, కర్రలతో దాడి చేశారని, తమను చంపుతామంటూ బెదిరించడంతో ఆందోళన చెందుతున్నామన్నారు. కలెక్టర్ స్పందించి, తక్షణం ఆ వ్యక్తులపై పోలీసు కేసులు నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. జి.వేమవరం గ్రామంలో శాంతియుత వాతావరణంలో నెలకొల్పాలని కోరారు.

పంట చేతికొచ్చే వేళ..


రెండు రోజుల క్రితం ఈదురు గాలులకు పండూరు వద్ద నేలను తాకిన వరిచేను

- రైతులను కలవరపెడుతున్న వాతావరణం
- అకాల వర్షం, ఈదురు గాలులకు నేలనంటిన వరి చేలు
- మరో వారంలో రబీ మాసూళ్లు

కాకినాడ రూరల్: వాతావరణం పగ పట్టిందా అన్నట్టుగా రబీ రైతులను అకాల వర్షాలు కలవర పెడుతున్నాయి. మరో వారం, పది రోజుల్లో పంట చేతికి వచ్చే తరుణంలో అకాల వర్షం, ఈదురు గాలులు రబీ రైతులకు ఆందోళనకు గురిచేస్తున్నాయి. రెండు రోజుల క్రితం బలమైన ఈదురు గాలులు, వర్షం పడడంతో చాలా చోట్ల వరిచేలు నేలను తాకాయి. ప్రస్తుతం వరిచేలు చివరి దశలో ఉన్నాయి. మాసూళ్లకు రైతులు సిద్ధమవుతున్న వేళ.. వాతావరణ శాఖ హెచ్చరికలు రైతన్నకు దినదిన గండంగా మారాయి. ఈ సీజన్‌లో రెండో పంటగా రబీ వరి సాగును రైతులు ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి చేపట్టారు.

కాకినాడ రూరల్ నియోజకవర్గంలో సుమారు 19 వేల ఎకరాలు వరి సాగవుతుండగా, రూరల్ మండలంలో సుమారు 4,500 ఎకరాలలో రబీ వరి సాగవుతుంది. తిమ్మాపురం, పండూరు, పి.వెంకటాపురం, నేమాం, తమ్మవరం, పెనుమర్తి తదితర గ్రామాలలో ఏలేరు కింద, సర్పవరం, కొవ్వాడ, తూరంగి, చీడిగ, రేపూరు తదితర గ్రామాలలో గోదావరి జలాలతో వరి చేలు సాగవుతున్నాయి. ఈ రబీ సీజన్‌లో ఎక్కువ మంది రైతులు దాదాపు 65 శాతం వరకు ఎంటీయూ - 3626(బొండాలు) రకం వరి వంగడాన్ని సాగు చేస్తుండగా, మిగిలిన 35 శాతం ఆయకట్టులో సన్నాలు రకం వరి వంగడాలు సాగు చేస్తున్నారు. మొత్తం ఆయకట్టులో 70 శాతం వరకు వెదజల్లు పద్ధతిలో సాగు చేపట్టారు. ఏలేరు కింద సన్నాలు రకాలు ఎక్కువగాను, గోదావరి కింద బొండాలు ఎక్కువగా సాగు చేస్తున్నారు. వరి చేలకు దుబ్బు కుళ్లు తెగులు, సుడి దోమ ఆశించడంతో పెట్టుబడులు అధికంగానే పెట్టారు. సన్నాలు రకాలు ముందుగానే కోతకు వచ్చే అవకాశం ఉండగా, బొండాలు రకం కాస్త ఆలస్యం కానుంది.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

రబీ వరి చేలు చివరి దశలో ఉన్నాయి. మరో వారంలో కోతలు ప్రారంభం కానున్నాయి. ఈ దశలో వాతావరణ మార్పులపై రైతులు అప్రమత్తంగా ఉండాలి. మళ్లలో నీరు నిలవకుండా చూసుకోవడంతో పాటు, బాగా తయారైన పంటను వరికోత యంత్రాలతో మాసూళ్లు చేపట్టి ధాన్యం ఒబ్బిడి చేసుకోవాలి. రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు రైతు సేవా కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి.

– చీకట్ల సత్యనారాయణ, వ్యవసాయాధికారి, కాకినాడ రూరల్

గొప్ప సంఘ సంస్కర్త కందుకూరి


బోట్‌క్లబ్‌లో కందుకూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న సభ్యులు

కాకినాడ రూరల్: సమాజంలో నెలకొన్న రుగ్మతలను, దురాచారాలను పారదోలేందుకు శారీరక, మానసిక దాడులకు సైతం వెరవకుండా ముందుకు సాగిన ధీరుడు, గొప్ప సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం అని సాహితీవేత్త డాక్టర్ శిరీష అన్నారు. వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక బోటు క్లబ్ ఉద్యానవనంలో కందుకూరి జయంతి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ శిరీష మాట్లాడుతూ, తన సాహిత్య వ్యాసాంగాన్ని సమాజ సేవకు సాధనంగా ఉపయోగించిన గొప్ప కవి అని కొనియాడారు. స్త్రీ విద్య వ్యాప్తి కోసం ఎంతో కృషి చేశారన్నారు. సమాజం కోసం తన విద్య, ధనం, జీవితం, గృహాన్ని అంకితం చేశారన్నారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా, కుల నిర్మూలనకు అకుంఠిత దీక్షతో శ్రమించారని వివరించారు. క్లబ్ అధ్యక్షులు అడబాల రత్నప్రసాద్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి డాక్టర్ దాసరి శ్రీధర్, ఓంనమశ్శివాయ, చింతపల్లి సుబ్బారావు, ప్రసాద్ నాయుడు, గోపి, న్యాయవాదులు నరహరిశెట్టి రవి, కొమ్మూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విజయ గణపతి విగ్రహ ప్రతిష్ఠ


చినమామిడాడలో స్వామివారిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి కన్నబాబు

కరప: కూరాడ శివారు చినమామిడాడలో కొత్తగా నిర్మించిన ఆలయంలో బుధవారం విజయ గణపతి విగ్రహ ప్రతిష్ఠ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చినమామిడాడలో వినాయక ఆలయం నిర్మించాలని గ్రామస్తుల వినతి మేరకు 2023లో అప్పటి కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు రూ.10 లక్షలు మంజూరు చేశారు. అలాగే గ్రామస్తులు, భక్తులు ఇచ్చిన విరాళాలతో ఆలయాన్ని నిర్మించారు. వేద పండితుల మంత్రోచ్చరణలతో మూడు రోజుల పాటు వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించి, విజయ గణపతి విగ్రహ ప్రతిష్ఠ జరిపారు. వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల కన్వీనర్, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, మండల అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, ఎంపీటీసీ గుత్తుల శాంతి, మాజీ సర్పంచ్ రావుల ప్రసాద్, పార్టీ నాయకులు గుత్తుల బాలాజీ, చిన్నం సూరిబాబు, సుధాకర్, చిన్నం అప్పారావు, నక్కా సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహా అన్న ప్రసాద వితరణ చేశారు. పరిసర గ్రామాల వారు స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

డ్రెయినేజీ భూముల్లో ఆక్రమణలు తొలగించాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

కరప: శహపురం డ్రెయిన్‌కు ఆనుకుని ఉండే భూములను ఆక్రమించుకుని ఆక్వా చెరువులు తవ్వడం వల్ల తమ పొలాలు ముంపునకు గురవుతున్నాయని, ఆక్రమణలను తొలగించాలని కోరుతూ బుధవారం తహసీల్దార్ ఎస్.సత్యనారాయణకు పలువురు రైతులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, శహపురం డ్రెయిన్ పరిధిలోని కరప సమీపంలో పోరంబోకు భూములను కొంగోడు గ్రామానికి చెందిన వ్యక్తి ఆక్రమించుకుని ఆక్వా సాగు చేస్తున్నాడన్నారు. డ్రెయినేజీ భూములు ఆక్రమించుకుని, చెరువులు తవ్వడం వల్ల తమ పొలాల్లోని మురికినీరు, ముంపునీరు డ్రెయిన్‌లోకి దిగక, పంటలు ముంపునకు గురవుతున్నాయన్నారు. సముద్రం పోటు, పాటులకు వచ్చేనీరు పొలాల్లోకి చేరి, సారవంతమైన భూములు చౌడుదేరుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్వా సాగు వ్యర్థాలను, బురద మట్టిని తోడటం వల్ల శహపురం డ్రెయిన్ పూడుపోయిందని, నీరు లాగక పొలాలు ముంపునకు గురవుతున్నాయని వివరించారు. శహపురం డ్రెయిన్‌ను పరిశీలించి, ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. రైతులు జి.సత్యనారాయణ, జి.బాలసూర్యనారాయణ, రాజాల అప్పారావు, బుడిత శ్రీను, ఎం.గోవిందరాజు, మోకన రాజు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు లావాదేవీలపై అవగాహన ఉండాలి

పిఠాపురం: మహిళా సంఘాలు బ్యాంకు లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలని ఉన్నతి యాంకర్ పర్సన్ పి.సూర్యనారాయణ అన్నారు. చేబ్రోలు మహిళా సమాఖ్య కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో సంఘ సభ్యులకు అవగాహన కల్పించారు. బ్యాంకులో సంఘ సభ్యులు దాచే పొదుపు, పొందే రుణాలపై పూర్తి అవగాహన ఉండాలని చెప్పారు. రుణాలు అందించడంలో బ్యాంకుల అలసత్వం ప్రదర్శిస్తే.. ప్రశ్నించేలా ఉండాలని, అందుకనుగుణంగా మహిళా సంఘాలు తయారు కావాలన్నారు. శ్రీనిధి ఏజీఎం చిట్టిబాబు మాట్లాడుతూ, రుణాలు తీసుకోవడంలోను, చెల్లించడంలోను క్రమశిక్షణ కలిగి ఉండాలని, తద్వారా రుణాలు అందించడంలో శ్రీనిధి ముందుంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సన్యాసిరావు, సీసీలు నాయుడు, రమణ, పలువురు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సమకాలీన సమస్యలకు దర్పణం.. నాటకం


నాటక కళాకారుడు కూచి భాస్కరరామ్‌ను సత్కరిస్తున్న సభ్యులు

కాకినాడ రూరల్: విజ్ఞానాన్ని, వినోదాన్ని, మానసిక చైతన్యాన్ని ప్రసాదించే చక్కటి వేదిక నాటకమని గ్రంథాలయ విశ్రాంత అధికారి చింతపల్లి సుబ్బారావు అన్నారు. స్థానిక రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో తెలుగు నాటక రంగ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన నాటక రంగం విభిన్న కథాంశాలతో, సమకాలీన సమస్యలకు పరిష్కారాలను చూపుతూ ఓ దర్పణంగా నిలిచిందన్నారు. తెలుగు నాటక రంగంలో తొలి నాటక కర్త, తొలి దర్శకుడు, తొలి ప్రదర్శనకారుడైన కందుకూరి వీరేశలింగం పంతులు జయంతిని తెలుగు నాటక రంగ దినోత్సవంగా 2007లో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్ణయించిందని తెలిపారు. నాటకాలకు ఆదరణ తగ్గుతున్నప్పటికీ సజీవ కళారూపాలుగా నాటక సమాజాలు నిలుపుతూ సమాజ హితాన్ని మాత్రం మరువలేదన్నారు. సినిమాలతో పోలిస్తే వీరు తమ కళారూపాల ద్వారా సామాజిక రుగ్మతలపై ప్రజల్లో చైతన్యం కల్పించడం విశేషమన్నారు. నాటక కళాకారుడు కూచి భాస్కర్ రామన్ మాట్లాడుతూ, నాటక రంగానికి అందించిన సేవలను వివరించారు. ఈ సందర్భంగా కొన్ని పద్యాలను పాడి వినిపించారు. ట్రస్ట్ చైర్మన్ అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో నాటక కళాకారుడు కూచి భాస్కర రామ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ప్రసాద్ నాయుడు, ఎస్.శ్రీనగేష్, ఓంనమశ్శివాయ తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షానికి రైతన్న విలవిల


విరవాడలో వర్షాల వల్ల నష్టం జరిగిన అరటి తోటను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి


వర్షానికి దెబ్బతిన్న బొప్పాయి


వర్షానికి పాడైపోయిన బెండ పాదులు


వర్షాలకు దెబ్బతిన్న మునగ తోట

పిఠాపురం: ఆరుగాలం శ్రమించిన అన్నదాత అకాల వర్షానికి విలవిల్లాడుతున్నాడు. వాతావరణంలో ఏర్పడిన మార్పులతో, ఈదురు గాలులతో కూడిన వర్షం కొద్ది రోజులుగా కురవడంతో వరి, వాణిజ్య పంటలు సాగు చేసిన రైతులు బెంబేలెత్తుతున్నారు. మూడు రోజుల క్రితం భారీ గాలులతో కూడిన వర్షం వల్ల పిఠాపురం నియోజకవర్గంలో పలు అరటి తోటలు నేలనంటాయి. దీంతో తీవ్ర నష్టాలు చవిచూడాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. గతంలో ఎదురైన కష్టనష్టాలను మరువకుండానే మరో విపత్తు ఎదురైంది. గతేడాది నెలకొన్న నష్టాల నుంచి తేరుకుందామనే ఆశతో ఆరుగాలం పండించిన పంట చేతికి దక్కే సమయంలో వర్షం తీరని నష్టం చేకూర్చింది. వాతావరణం బాగుండడంతో పంట ఆశాజనకంగా పండింది. తమ కష్టాలు తీరుతాయనే రైతుల ఆశలపై అకాల వర్షం నీళ్లు చల్లింది.

38 వేల ఎకరాల్లో సాగు

నియోజకవర్గ పరిధిలో పీబీసీ, ఏలేరు, ఆర్‌ఆర్‌బీ ట్యాంక్, చెరువులు, బోర్ల కింద సుమారు 38 వేల ఎకరాల్లో దాళ్వా సాగు చేశారు. ప్రస్తుతం మూడొంతుల కోతలు పూర్తయ్యాయి. ఈ దశలో వర్షం కురవడంతో పనలపై ఉన్న వరిచేలు తడిసి ముద్దయ్యాయి. కళ్లాల్లో ఉన్న ధాన్యం చుట్టూ నీరు చేరింది. పల్లపు ప్రాంతాల్లోని వరి పనల్లో నీరు చేరింది. వరి చేలు చాలా చోట్ల నేలనంటాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. మరో 24 గంటల పాటు వర్షం పడితే పనలపై ఉన్న వరి చేలు మొలకెత్తే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. నేలనంటిన చేలను కోయడానికి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందంటున్నారు. కాగా కళ్లాల్లో ఉన్న ధాన్యం రాసులను ఎడ్లబళ్లపై తరలిస్తున్నారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పండిన కొద్ది పంటనైనా దక్కించుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు.

వాణిజ్య పంటలకూ..

అకాల వర్షం వల్ల వాణిజ్య పంటలకు తీరని నష్టం జరిగే అవకాశం ఉంది. గొల్లప్రోలు , పిఠాపురం మండలంలోని విరవాడ, విరవ, మంగితుర్తి, గొల్లప్రోలు, చేబ్రోలు, దుర్గాడ, ఎ.విజయనగరం, చెందుర్తి, తాటిపర్తి గ్రామాల్లో సుమారు 2 వేల ఎకరాలకు పైబడి వాణిజ్య పంటలు సాగు చేశారు. కోత దశలో ఉన్న సమయంలో వర్షం కురవడంతో భారీ నష్టం సంభవించే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. బొప్పాయి, మునగ, బెండ, అరటి తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. దీంతో ఉద్యాన శాఖ అధికారులు పంటల నష్టాలను అంచనా వేసే పనిలో నిమగ్నమయ్యారు.

ఆపద్బాంధవులు


గ్యాస్ లీకేజీ వల్ల వచ్చే మంటలను అదుపు చేస్తూ..

- ప్రమాద ఘంటికలు మోగితే దూసుకొచ్చేవి ఫైరింజన్లే..
- ఘనంగా అగ్నిమాపక వారోత్సవాలు
- ప్రమాదాల నివారణపై అవగాహన
- ఆకట్టుకుంటున్న విన్యాసాలు

కాకినాడ క్రైం: అగ్నిమాపక సేవలంటే ఆషామాషీ కాదు. ఫైర్ విభాగంలో ప్రతి క్షణం ప్రాణాలతో చెలగాటమే. కాల్ మోగిందా ప్రమాద ఘంటికలు మోగినట్టే. అపాయంలో ఉన్న ప్రజల ప్రాణాలు కాపాడేందుకు సిబ్బంది పెను ప్రమాదాల వైపు పరుగు పెడుతుంటారు. తమ కుటుంబాలను సైతం విస్మరించి, అపాయంలో ఉన్నవారి ప్రాణ రక్షణ కోసం చివరి క్షణం వరకు పోరాడుతారు. విపత్కర వేళలో తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా, ఆపదలో చిక్కుకున్న వారితో పాటు, వారి సంపదనూ గట్టెక్కిస్తారు. అటువంటి అసామాన్య అగ్నిమాపక సేవల స్మరణకు వారోత్సవాలు వేదికగా మారాయి. వారోత్సవాల్లో భాగంగా అగ్నిమాపక సేవలు, ఆవశ్యకతతో పాటు, ప్రాధాన్యాలను వివరిస్తూ, అవగాహన కల్పిస్తున్న తీరు ఆకట్టుకుంటోంది. కాకినాడలో జిల్లా సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి ఉద్దండరావు సుబ్బారావు ఆధ్వర్యంలో వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.

అవగాహనే లక్ష్యంగా..

అవగాహన ద్వారా అగ్ని ప్రమాదాలు, తద్వారా వాటిల్లే నష్టం నిలువరించవచ్చన్న ప్రాథమిక సూత్రంతో అవగాహన సదస్సులకే అగ్నిమాపక అధికారులు తొలి ప్రాధాన్యమిస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రదర్శనలు, విన్యాసాలు నిర్వహిస్తున్నారు. ప్రజలు, విద్యార్థుల్లో కూడా దీనిపై ఆసక్తి నెలకొనడంతో అధికారుల ఆలోచనలు సత్ఫలితాలనిస్తున్నాయి.

ప్రదర్శనల కోసం ప్రత్యేక శిక్షణ

కత్తిమీద సాము లాంటి ఉద్యోగాన్ని ఇష్టంతో చేసే సిబ్బందిని ప్రదర్శనలు, విన్యాసాల కోసం ప్రత్యేక శిక్షణతో సంసిద్ధుల్ని చేశారు. అంతేగాక వాల్‌పోస్టర్లు, కరపత్రాలతో ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఈ విన్యాసాల్లో కాకినాడలో మొత్తం 25 మంది సిబ్బంది, అధికారులు కీలకంగా వ్యవహరిస్తున్నారు. లీడింగ్ ఫైర్‌మన్ ఎం.చక్రపాణితో పాటు, జీఎస్ఆర్‌కే రెడ్డి, డి.వీరబాబు, బి.పింగళరావు, ఎం.మౌళిదాసు ప్రత్యేక శిక్షణ పొందారు. ఫైర్ టెండర్లు-2, మిస్ట్ వెహికల్-1, మిస్ట్ బుల్లెట్-1, మినీ బస్సు-1, బ్రీతింగ్ ఆపరేటర్లు, పవర్ సాస్‌లతో పాటు, పలు పరికరాలు, వాహనాలు ఈ విన్యాసాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

వారోత్సవాలు ఇలా...

జిల్లా ఫైర్ అధికారి పివి.సాయి రాజేష్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న ఈ వారోత్సవాలను జిల్లా కలెక్టర్ షన్‌మోహన్ ఈ నెల 14వ తేదీన ప్రారంభించారు. తొలి రోజు అమరవీరుల సంస్మరణ సభ జరిగింది. ఇంకా అగ్నిమాపక వాహనాలు, యంత్రాలు, పరికరాల ప్రదర్శనలు నిర్వహించారు. ఏడీబీ రోడ్‌లో అత్యవసర సమయాల్లో ప్రమాదాల నుంచి రక్షించేందుకు ఎవాక్యుయేషన్ మాక్ డ్రిల్ జరిగింది.

అవగాహనే లక్ష్యంగా వారోత్సవాలు



అవగాహనే లక్ష్యంగా వారోత్సవాలు నిర్వహిస్తున్నాం. అగ్నిమాపక సేవలంటే ఆషామాషీ కాదు. ప్రాణాలకు తెగించి, ప్రమాదానికి ఎదురెళ్లి పోరాడాల్సి ఉంటుంది. ఆ విషయాలన్నీ ప్రజలతో పంచుకుంటూ, వారికి సంరక్షణపై అవగాహన ఇవ్వడమే వారోత్సవాల లక్ష్యం. సిబ్బంది కష్టం ఎనలేనిది. ఫైర్ సిబ్బంది చేరేలోపు ప్రమాద పరిమితిని నియంత్రించడం, తమను తాము కాపాడుకునే ప్రాథమిక ప్రక్రియలను ప్రజలకు నేర్పిస్తున్నాం.

– ఉద్దండరావు సుబ్బారావు, జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి, కాకినాడ

నేడు అవగాహన

నివాస గృహాలు, అపార్టుమెంట్లలో నిర్వాసితులకు కిచెన్, ఎలక్ట్రికల్, వేసవి సంబంధ అగ్ని ప్రమాదాల నివారణపై గురువారం అవగాహన కల్పిస్తారు. 18న పరిశ్రమల్లో సంభవించే అగ్నిప్రమాదాల నివారణ, జాగ్రత్తలపై వాకలపూడి ఎస్‌సీఎస్ ఇండస్ట్రీలో అవగాహన కల్పిస్తారు. 19న కాకినాడ ఈఎస్ఐ ఆసుపత్రి వద్ద ఫైర్ సేఫ్టీ ప్రాముఖ్యం, ఫస్ట్ ఎయిడ్ ఫైర్ ఫైటింగ్‌పై ఎమర్జెన్సీ మాక్ డ్రిల్ నిర్వహిస్తారు. 20న రామారావు పేటలోని రెడ్ క్రాస్ భవనంలో ముగింపు సమావేశం జరుగుతుంది.


ఫోం ద్వారా మంటలను అదుపు చేసే ప్రక్రియ


వాహనాల్లో చెలరేగే అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన